ఈనాడు కామారెడ్డి
శుక్రవారం అక్టోబరు 18, 2024

ఇందిరమ్మ కమిటీలపై రగడ

- భారాస కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఆందోళన
- జాబితాలో కాంగ్రెస్ నాయకుల పేర్లు పెట్టారని ఆరోపణ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ఇందిరమ్మ గృహ పథకానికి సంబంధించి వార్డు స్థాయి కమిటీల ఏర్పాటు వివాదానికి దారి తీసింది. తాము ఇచ్చిన పేర్లు కాకుండా కాంగ్రెస్ నాయకులకు జాబితాలో చోటు కల్పించారని భారాస కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పురపాలక కార్యాలయానికి వచ్చి కమిషనర్ సుజాతను నిలదీశారు. 49 వార్డులకు సంబంధించి స్థానిక వార్డు కౌన్సిలర్ ఛైర్మన్‌గా, స్వయంసంఘాల నుంచి ఇద్దరు మహిళలు, వార్డులో ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి ఒక్కొక్కరిని, వార్డు అధికారి కన్వీనర్‌గా కమిటీల్లో చోటు కల్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భారాస కౌన్సిలర్లు కారంగుల అంజల్‌రెడ్డి, పిట్ల వేణు, అఫీజ్, స్వప్న, నజీరొద్దిన్, భాస్కర్ ప్రాతినిథ్యం వహిస్తున్న వార్డుల్లో కాంగ్రెస్ నాయకుల పేర్లు చేర్చడం వివాదానికి కారణమైంది. 43వ వార్డులో నివసించే మాజీ వైస్‌ఛైర్మన్ మసూద్‌అలీ 25వ వార్డు కమిటీలో ఎలా సభ్యుడిగా ఉంటారని కౌన్సిలర్ అంజల్‌రెడ్డి ప్రశ్నించారు. 47వ వార్డులో అందరి పేర్లు కాంగ్రెస్ నాయకులవేనని కౌన్సిలర్ పేర్కొన్నారు. కమిటీల ఏర్పాటుకు పేర్లు ఇవ్వాలని వారం రోజుల పాటు ఒత్తిడి తెచ్చారన్నారు. చివరకు తాము ఇచ్చిన పేర్లు మార్చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశాల మేరకు పేర్లు మార్చామని కమిషనర్ సుజాత తమకు వెల్లడించినట్లు భారాస కౌన్సిలర్లు తెలిపారు. దీంతో వారు కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.


పురపాలక కార్యాలయంలో కమిషనర్ సుజాతను ప్రశ్నిస్తున్న భారాస కౌన్సిలర్లు

ఇంకా మీనమేషాలే..!

బాన్సువాడలో నాణ్యతలేని చేపపిల్లలను తిప్పిపంపిన మత్స్యకారులు

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, బాన్సువాడ

చేపపిల్లల ఉచిత పంపిణీకి ఇంకా గ్రహణం వీడడం లేదు. ఈ ఏడాది సమృద్ధిగా కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ఈ ఏడాది జలాశయాల్లో నిర్దేశిత లక్ష్యంలో 50 శాతం చేపపిల్లల విత్తనాలను మాత్రమే వదిలేందుకు గుత్తేదారులతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సెప్టెంబరు నెలాఖరుకల్లా విత్తనాల పంపిణీ పూర్తిచేయాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు కేవలం బాన్సువాడ కల్కి చెరువుతోనే సరిపెట్టారు. గుత్తేదారు ఎప్పటిలోగా చెరువుల్లో వదులుతారనేది ప్రశ్నార్థకంగా మారింది.

నాసిరకం కారణంగా వెనక్కి

టెండర్ దక్కించుకున్న గుత్తేదారు ఇటీవల కల్కిచెరువులో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పంపిణీకి శ్రీకారం చుట్టారు. నాసిరకం చేపపిల్లలు తేవడంతో స్థానిక మత్స్యకారులు, సంబంధిత శాఖ అధికారులు అభ్యంతరం తెలిపారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సైతం గుత్తేదారు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆ చేపపిల్లల వ్యానును తిప్పి పంపారు.

మచ్చిక చేసుకుని మమ

జిల్లాలోని 768 జలాశయాల్లో 1.47 కోట్ల చేప పిల్లలను వదలాల్సి ఉంది. ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీని పారదర్శకంగా నిర్వహించేందుకు సాంకేతికతను వినియోగించడంతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉండాలనే ఉద్దేశంతో పంపిణీ కమిటీలను ఏర్పాటు చేసింది. టెండర్ దక్కించుకున్న గుత్తేదారు పంపిణీ కమిటీ సభ్యులను మచ్చిక చేసుకుని మమ అనిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బాన్సువాడలో సైజు తక్కువగా ఉన్నాయని, నాణ్యంగా లేవని మత్స్యకారులు, స్థానికులు ధ్రువీకరించినప్పటికీ పంపిణీ కమిటీ సభ్యుల సహకారంతో నిర్దేశిత లక్ష్యం మేరకు పిల్లలను చెరువులో వదలడమే ఇందుకు నిదర్శనం. ప్రజా ప్రతినిధుల అభ్యంతరంతో కొన్నింటిని మాత్రమే తిప్పిపంపారు.


పంపిణీకి తెచ్చిన నాణ్యత లేని, సైజు తక్కువ ఉన్న చేపపిల్లలు

గుత్తేదారుకు నోటీసు జారీచేశాం

- శ్రీపతి, మత్స్యశాఖ అధికారి, కామారెడ్డి

గడువులోపు జలాశయాల్లో చేపపిల్లల విత్తనాలను పంపిణీ చేయాలని, లేదంటే బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరిస్తూ గుత్తేదారుకు నోటీసు జారీ చేశాం. మత్స్యకారులు, పంపిణీ కమిటీ సభ్యుల సమక్షంలోనే చేపవిత్తనాలు పంపిణీ చేయనున్నాం. పంపిణీ సందర్భంగా వీడియో చిత్రీకరణ చేయాలని నిర్ణయించాం. పంపిణీ కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తే నాణ్యత లేని విత్తనాలు తిప్పి పంపిస్తాం.


బాన్సువాడలో చేపపిల్లల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి (పాత చిత్రం)

నిబంధనల ప్రకారం..

చేపపిల్లల పంపిణీలో అక్రమాలు అరికట్టాలని ప్రభుత్వం జలాశయాలను మూడు రకాలుగా వర్గీకరించి ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేసింది. వారి ఆధ్వర్యంలో వీడియో చిత్రీకరణ చేస్తూ పంపిణీ చేయాలని నిర్దేశించింది.


- నిర్దేశిత పంపిణీ కమిటీ సభ్యులు, మత్స్యశాఖ అధికారులు చేపపిల్లల నాణ్యత, పరిమాణం చూసిన తర్వాతే చెరువులు, కుంటల్లో వదలాల్సి ఉంటుంది.
- ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు నీరు నిల్వ ఉండే జలవనరుల్లో 35-40 మి.మీ సైజువి వదలాలి. ఇందులో 35 శాతం కట్ల, 35 శాతం రాహు, 30 శాతం బంగారు తీగ రకాల పిల్లలను విడిచిపెట్టాలని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది.
- ఏడాది పాటు నీరు నిల్వ ఉండే జలాశయాల్లో 80-100 మి.మీ సైజు చేపపిల్లలను వదలాలి. ఇందులో 40 శాతం బొచ్చ, 50 శాతం రాహు, 10 శాతం మిరుగల రకాలను పంపిణీ చేయాలి.

వైద్యకళాశాలతో మెరుగైన సేవలు

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

ఈనాడుతో ప్రిన్సిపల్ శివప్రసాద్

జిల్లాకేంద్రంలో వైద్యకళాశాల ఏర్పాటుతో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయని ప్రిన్సిపల్ శివప్రసాద్ పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు విజయవంతంగా తరగతులు నిర్వహించామన్నారు. బోధనాసుపత్రి నిర్వహణకు చేస్తున్న కార్యాచరణపై ఆయన ఈనాడు ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు. వారి మాటల్లోనే..



వైద్యకళాశాలతో పాటు బోధనాసుపత్రిలో బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తున్నాం. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు సేవలు అందిస్తున్నాం. దీంతో రోగుల తాకిడి పెరిగింది. మూడు నెలల్లో సీనియర్ రెసిడెంట్లు రానున్నారు. మరిన్ని వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. సమయపాలన పాటించని వైద్యులు, ఆచార్యులకు నోటీసులు జారీ చేశాం.

అందుబాటులోకి ప్రయోగశాలలు

వైద్యకళాశాల జిల్లాకేంద్రం శివారులో ఉండడంతో వైద్యవిద్యార్థులు రవాణా పరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పరంగా రవాణా సౌకర్యాలు కల్పించాలని జిల్లా యంత్రాంగానికి నివేదించాం. విద్యార్థుల వసతికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. వైద్య కళాశాలలో అవసరమైన పరికరాలు, ప్రయోగశాలలు అందుబాటులోకి వచ్చాయి. కళాశాలకు భగీరథ నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని పురపాలక సంఘం అధికారులకు లేఖ రాశాం. ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్యార్థులకు చికిత్స విధానంపై ప్రయోగాత్మక తరగతులు నిర్వహిస్తున్నాం. మరో రెండేళ్ల పాటు రోగులకు చికిత్స చేస్తూ ప్రొఫెసర్లు వైద్య విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తారు.

బోధనాసుపత్రిలో...

అంశం	రెగ్యులర్	ఒప్పంద
ప్రొఫెసర్లు	13	4
అసోసియేట్	16	-
అసిస్టెంట్	30	13

రెట్టింపయిన రోగుల సంఖ్య

గతంతో పోలిస్తే బోధనాసుపత్రికి రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య రెట్టింపయింది. గైనకాలజీ విభాగంలో సీనియర్ రెసిడెంట్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరత వేధిస్తోంది. జనరల్ మెడిసిన్ విభాగంలో ఎస్‌ఆర్‌ల కొరతతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నాం.

త్వరలో మరిన్ని అనుబంధ కళాశాలలు

కళాశాలకు అనుబంధంగా త్వరలో మరిన్ని వైద్య సంబంధ కళాశాలలు ఏర్పాటు కానున్నాయి. పీజీ సీట్లకు అనుమతి కోసం అవకాశం లభించింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వైద్యకళాశాల భవనం, ఆసుపత్రి భవనం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎన్‌ఎంసీ(జాతీయ వైద్యవిధాన మండలి)కి పీజీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేయనున్నాం

దిక్కుతోచని మొక్కజొన్న రైతు

న్యూస్‌టుడే, భిక్కనూరు

రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ నేటికీ రైతుల కష్టాలు తీరడం లేదు. జిల్లాలో 57,315 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుందని అధికారులు అంచనా వేయగా 44,601 ఎకరాల్లో రైతులు పంట వేసినట్లు తేల్చారు. మొక్కజొన్న పంట చేతికొచ్చి 15 రోజులైనా కొనుగోలు చేసేవారు లేక అన్నదాతలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పంటను రోడ్డుపై ఆరబోసి దళారుల కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

తుపాను ప్రభావంతో ఆందోళన

పంటలను కోసి రోడ్లపై ఆరబెడుతున్నారు. రాత్రి పగలు కాపలా కాస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. ప్రస్తుతం తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చేతికందిన పంట తడిసిపోతుందేమోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ మొక్కజొన్న కోసం ఎలాంటి ప్రతిపాదనలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దళారులను సంప్రదిస్తే క్వింటాకు రూ.2300 అని చెబుతున్నా.. కొనుగోలుకు ముందుకు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారని వాపోయారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల విషయమై మార్కెటింగ్ శాఖ అధికారి వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.


భిక్కనూరు శివారు జాతీయ రహదారి 44 సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న

ప్రభుత్వం ఆదుకోవాలి

- సందుగారి సాయిరెడ్డి, రైతు, రామేశ్వరపల్లి

మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. పంట చేతికొచ్చి 15 రోజులు అవుతుంది. రోడ్డుపై పంటను ఆరబెట్టాం. వర్షాలు పడే అవకాశం ఉన్నందున త్వరగా పంటను అమ్ముకోవాలని చూస్తున్నాం. వ్యాపారులు వారం రోజులుగా కొనుగోలు చేస్తామని చెబుతున్నా.. ఎవరూ రావడం లేదు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

అమ్ముకోలేక ఇబ్బందులు

- మహిపాల్, రైతు, రామేశ్వరపల్లి

కోతులు, అడవిపందుల బారి నుంచి మొక్కజొన్న పంటను రక్షించుకున్నాం. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి తీరా పంట చేతికొచ్చాక కొనుగోలు చేసేవారు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొందరు వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. రోడ్లపై ఉండలేక వ్యాపారులు నిర్ణయించిన ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఎన్నాళ్లు తోడేస్తారు?

చిత్రంలో కనిపిస్తున్న నీరు జిల్లాకేంద్రంలో సత్యగార్డెన్ సమీపంలోని ప్రధాన రోడ్డుమీదిది. చిన్న వర్షం కురిస్తే చాలు ఇలా నీరు రోడ్డుమీద నిండిపోతోంది. ఈ నీటిని మళ్లించడానికి మురుగు వ్యవస్థ లేకపోవడమే ప్రధాన కారణం. నీరు నిండిన ప్రతిసారీ మున్సిపాలిటీ వారు సెప్టిక్ ట్యాంక్ వాహనంతో తోడేస్తున్నారు. మూడు నెలల నుంచి ఇలానే చేస్తున్నారు. శాశ్వత మురుగు వ్యవస్థ ఏర్పాటు చేయించాలని దుకాణదారులు, ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్**

'కేసీఆర్ సహకారంతోనే పేదలకు ఇళ్లు నిర్మించా'

బీర్కూర్, బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే : మాజీ సీఎం కేసీఆర్ సహకారంతోనే తన నియోజకవర్గంలో వేలాది మంది పేదలకు ఇళ్లు నిర్మించానని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బీర్కూర్, బరంగెడ్గి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ధాన్యం విక్రయించడంలో బాన్సువాడ నియోజకవర్గ రైతులు రాష్ట్రంలో ఎప్పుడూ ముందంజలో ఉంటారని చెప్పారు. తాను నిధులు మంజూరు చేయించి గ్రామాల్లో అభివృద్ధి చేస్తే కొంతమంది వారే అభివృద్ధి చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం పద్ధతి కాదన్నారు. సొసైటీ ఛైర్మన్ గాంధీ, వైస్ ఛైర్మన్ రాధాకృష్ణ, తహసీల్దార్ లత, ఎంపీడీవో భారతి, విండో కార్యదర్శి విఠల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే, ఆగ్రోస్ ఛైర్మన్‌లు తాడ్కోల్‌లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, సొసైటీ ఛైర్మన్ గంగారం, సురేష్‌గుప్తా, ఎజాజ్, శ్రీధర్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీర్కూర్‌లో ధాన్యం తూకం వేస్తున్న ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం

డ్వాక్రా సంఘాల్లో అవకతవకలు ?

రామారెడ్డి, న్యూస్‌టుడే: రెడ్డిపేట్ గ్రామంలో కొన్ని డ్వాక్రా సంఘాల్లో అవకతవకలు జరిగినట్లు ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. మహిళల పేరుపై రుణం తీసుకుని ఐకేపీ సిబ్బంది వాడుకున్నట్లు తెలియడంతో.. మండల స్థాయి అధికారులు వారి నుంచి వసూలు చేసి బ్యాంకులో కట్టినట్లు తెలుస్తోంది. రెడ్డిపేట్, రామారెడ్డి గ్రామాల్లో బ్యాంకులున్నా.. ఐకేపీ అధికారులు కామారెడ్డిలో రుణం ఇప్పించినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఐకేపీ సిబ్బంది అవకతవకలు చేయలేదని, స్త్రీనిధి రుణం కట్టినా అప్‌డేట్ కాక ఇబ్బంది తలెత్తిందని ఏపీఎమ్ ప్రసన్నకుమార్ తెలిపారు. అవకతవకలు జరిగితే విచారిస్తామని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని వాహన యజమానులపై కేసు నమోదు చేసిన సంఘటన మండలకేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్కుంద మండలం హస్గుల్ నుంచి మండల కేంద్రం వైపు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అంజని గేటు వద్ద 161వ జాతీయ రహదారిపై పట్టుకున్నారు.

లాఠీలు వీడి.. బోధనకు కదిలి
... వివరాలు 6లో

పండగ ఆదాయం రూ.1.69 కోట్లు


ఈ నెల 17 వరకు కొనసాగిన 586 ప్రత్యేక బస్సులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపించడంతో ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరింది. ఈ నెల 1 నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. నిజామాబాద్ 1, 2, ఆర్మూర్, బోధన్, కామారెడ్డి, బాన్సువాడ డిపోల నుంచి 586 బస్సులు నడిపారు. పండగల సందర్భంగా సంస్థకు రూ. 1,69,08,445 కోట్ల ఆదాయం వచ్చిందని ఆర్టీసీ ఆర్‌ఎం జానిరెడ్డి తెలిపారు.

ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షణలో..

పండగ సందర్భంగా జేబీఎస్ నుంచి జిల్లాకు రద్దీ కొనసాగింది. అక్కడ జిల్లా నుంచి ప్రత్యేక సిబ్బందిని ఉంచి పర్యవేక్షించారు. పండగ అనంతరం నిజామాబాద్ నుంచి జేబీఎస్‌కు రద్దీ పెరగడంతో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి అధికారుల పర్యవేక్షణలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నడిపించారు.


గమ్యస్థానాలకు వెళ్లేందుకు ప్రయాణికుల రద్దీ

డిపోల వారీగా వివరాలు

డిపో	బస్సులు	కిలోమీటర్లు	ఆదాయం (రూ॥)
ఆర్మూర్	140	49,448	37,46,215
బోధన్	77	31,100	23,44,550
నిజామాబాద్-1	109	43,410	35,45,801
నిజామాబాద్-2	98	37,656	24,84,230
బాన్సువాడ	81	30,985	22,23,195
కామారెడ్డి	81	32,500	25,64,454
మొత్తం	586	2,25,099	1,69,08,445

లాఠీలు వీడి.. బోధనకు కదిలి



☛ ఉపాధ్యాయ కొలువులు కొట్టిన కానిస్టేబుళ్లు

డీఎడ్, బీఎడ్, బీపెడ్ చేసినా సమయానికి డీఎస్సీలు పడక సమయం వృథా అయింది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు కానిస్టేబుల్ కొలువులు కొట్టి లాఠీలు పట్టారు. పోలీసు శాఖలో తీరికలేకుండా విధులు నిర్వర్తిస్తూనే తమకిష్టమైన బోధన వృత్తిపై మమకారం మరువలేదు. బాధ్యతలు సమన్వయం చేసుకుంటూనే వీలు చేసుకొని డీఎస్సీకి సిద్ధమయ్యారు. తాజా ఫలితాల్లో ఏడుగురు ఉపాధ్యాయులయ్యారు. నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ వారిని అభినందించి.. ఈ నిబద్ధతే బోధనలోనూ చూపి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని సూచించారు.

● పేరు ❖ ఊరు, మండలం ◆ సాధించిన ర్యాంకు
✻ పొందిన మార్కులు ➺ పోస్టు కేటగిరీ ☛ ఎన్నేళ్లు కష్టపడ్డారు

ఉన్నతంగా తీర్చిదిద్దుతా



● మూసరి వినోద్‌కుమార్
❖ మంథని, ఆర్మూర్
◆ 550 ✻ 62.77 ➺ ఎస్జీటీ

☛ భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే వృత్తిలో చేరాలనే లక్ష్యంతో గత ఏడాదిగా కష్టపడుతున్నాను. 2018 కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. వీలు చిక్కినప్పుడల్లా సెలవులు తీసుకొని చదివా. అమ్మ లక్ష్మి నా వెన్నంటి ప్రోత్సహించారు.

- న్యూస్‌టుడే, ఇందూరు సిటీ

అమ్మ కష్టానికి ప్రతిఫలం



● ఎం లిఖిత ❖ చిన్‌రాజ్‌పల్లి, నందిపేట్ ◆ 172 70.37
✻ 70.37 ➺ ఎస్జీటీ

☛ ఆరేళ్ల నుంచి ఉపాధ్యాయ కొలువు కోసం చదువుతున్నాను. అమ్మ గంగామణి బీడీలు చుడుతూ నన్ను చదివించారు. నాలుగేళ్ల కిందట సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. కుటుంబానికి అండగా ఉండాలని ఆ ఉద్యోగం చేస్తూనే నాకిష్టమైన బోధన వృత్తిలోకి రావాలని కష్టపడ్డాను. పోలీసు శాఖలో సెలవులు దొరకవు. ఒకవైపు విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీ కోసం సమయం దొరికినప్పుడల్లా చదివాను. అమ్మ పడిన కష్టానికి ప్రతిఫలం దక్కింది. మొదటి పోస్టింగ్ రెంజల్ మండలం కందకుర్తి ప్రాథమిక పాఠశాలలో వచ్చింది. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

- న్యూస్‌టుడే, ఇందూరు సిటీ

ఉత్తమ క్రీడాకారులుగా మారుస్తా



● నవీన్ కచ్చుకాయల
❖ యానంపల్లి, డిచ్‌పల్లి ◆ 3
✻ 63 ➺ పీఈటీ

☛ రెండేళ్లుగా సిద్ధమవుతున్నాను. ఇందు కోసం ఎలాంటి శిక్షణ లేకుండా సొంతంగానే చదివా. 2018లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడాలని అనుకున్నాను. తల్లిదండ్రులు సావిత్రి, గంగారాం ఎన్నో కష్టాలు పడ్డారు. నా విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా మారుస్తా. **- నిజామాబాద్ క్రీడావిభాగం**

ఎనిమిదేళ్ల శ్రమ



● కౌడ నాగేంద్రబాబు ❖ ఇస్సాపల్లి ఆర్మూర్
◆ 14 ✻ 79.53 ➺ ఎస్జీటీ

☛ 2015లో డీఎడ్ పూర్తయిన నుంచి డీఎస్సీ కోసం సన్నద్ధమవుతున్నాను. 2017 డీఎస్సీలో 0.2 మార్కుల తేడాతో ఉద్యోగావకాశం కోల్పోయా. నాకు ఉపాధ్యాయ వృత్తి అంటే ఎనలేని ప్రేమ. బంధువులు, తెలిసిన వారు ఇప్పట్లో డీఎస్సీ వేయరు ఏదైనా ఉద్యోగం చేసుకోవాలనేవారు. వారి ఒత్తిడి నుంచి బయట పడేందుకు 2020లో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. అటు విధులు నిర్వహిస్తూనే దొరికిన కొద్దిపాటి సమయంలో నాకిష్టమైన బోధన రంగంలోకి రావాలని చదివా. ఈ సారి జిల్లాలో ఎస్జీటీ విభాగంలో 14వ ర్యాంకు రావడంతో కలసాకారమైంది. **- న్యూస్‌టుడే, నిజామాబాద్ నేరవిభాగం**

నా జీవితంలో ప్రత్యేకమైన రోజు



● దండు మహేశ్ ❖ అర్సపల్లి, నిజామాబాద్
◆ 4 ✻ 79.80 ➺ గణితం, స్కూల్ అసిస్టెంటు

☛ రెండేళ్ల నుంచి లక్ష్యం కోసం కసిగా చదువుతున్నాను. గత ప్రభుత్వ హయాంలో కానిస్టేబుల్ ఉద్యోగం వరించినా ఆ విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీ కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించా. పోలీసు శాఖలో విధులు సమన్వయం చేసుకొని చదవడం కొంచెం కష్టమైంది. అయినా నాకు నచ్చిన వృత్తి కావడంతో కఠోరంగా శ్రమించాను. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషిచేస్తా. నవీపేట మండలం ఫకీరాబాద్ జడ్పీహెచ్‌ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా చేరిన రోజు నాకెంతో ప్రత్యేకం. **- న్యూస్‌టుడే, నిజామాబాద్ నేరవిభాగం**

ఆటుపోట్లు తట్టుకొని..



● కడారి నాగరాజు
❖ సుంకెట్, మోర్తాడ్
◆ 239 ✻ 69 ➺ ఎస్జీటీ

☛ 2017 నుంచి డీఎస్సీకి సిద్ధమవుతున్నా. 2018లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ఆరేళ్లుగా ఆ విధుల్లో తీరికలేకుండా గడిపాను. మధ్యలో ఆటుపోట్లు వచ్చినా తట్టుకుని లక్ష్య సాధనలో ముందుకు సాగా. అమ్మానాన్న లక్ష్మి, బక్కన్న ప్రోత్సాహంతో కష్టపడ్డా. ఏర్గట్ల మండలం దోంచందా ప్రాథమిక పాఠశాలలో చేరా. విద్యార్థులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందిస్తా.

- న్యూస్‌టుడే, ఇందూరు సిటీ

12 ఏళ్లుగా..



● హరీశ్ పెగడ
❖ శెట్‌పల్లి, మోర్తాడ్
◆ 4 ✻ 63.5 ➺ పీఈటీ

☛ 2012లోనే కానిస్టేబుల్ ఉద్యోగం వరించింది. పోలీసు శాఖలో కొత్తగా వచ్చిన వారికి శిక్షణ ఇస్తుంటా. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శిక్షకుడిగా పనిచేయాలని నిర్ణయించుకున్నా. 12 ఏళ్లుగా కష్టపడుతూనే ఉన్నా. 2017 డీఎస్సీలో స్వల్ప తేడాతో ఉద్యోగం చేజార్చుకున్నా. అప్పటి నుంచి మరింత కసిగా చదివి పీఈటీగా ఎంపికయ్యా. రెంజర్ల జడ్పీహెచ్‌ఎస్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా చేరా.

- న్యూస్‌టుడే, నిజామాబాద్ క్రీడావిభాగం



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు, నిర్వాహకులు

చదరంగంలో రాష్ట్రస్థాయికి ఎంపిక

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగం పోటీలు దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. అండర్-17 బాలుర విభాగంలో రవివర్మ(బోధన్ గురుకులం), శ్రీహర్ష (ఎల్లారెడ్డి గురుకులం), రూపేంద్ర (ఎస్ఎస్ఆర్ నిజామాబాద్), సౌరాజ్(పెర్కిట్ ఆదర్శ పాఠశాల), గణేశ్(బిచ్కుంద) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో హర్షిత(కాకతీయ, నిజామాబాద్), శ్రీనిత(ఎస్‌పీఆర్, కామారెడ్డి), స్నేహిత(ఎస్‌పీఆర్, కామారెడ్డి), రోషిని (అభ్యాస, నిజామాబాద్), పల్లవి(నిజామాబాద్ గురుకులం) ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో రిషిత, మనోజ్ఞ, నాగ జాషనిక, శరద్రుతి, చిన్మయిలు, బాలుర విభాగంలో.. శివకుమార్, సాయి దీక్షిత్, జోసెఫ్, ధనుష్, సుశాల్‌లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో డీఈవో రాజు, హెచ్ఎం గంగాకిషన్, స్వామిగౌడ్, ప్రభులింగం, లక్ష్మణ్, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్‌లో..

కామారెడ్డి క్రీడావిభాగం : కామారెడ్డి సీనియర్ సిటిజెన్ ఫోరం కార్యాలయంలో ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడలను గురువారం నిర్వహించారు. అండర్-17 బాలుర విభాగంలో నౌషద్, భవానీ ప్రసాద్, అహ్మద్ (కాకతీయ, నిజామాబాద్), వర్ధన్ (అభ్యాస, నిజామాబాద్), రోనాల్డ్ (జీజేసీ, మాక్లూర్)లు టాప్‌లో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బాలికల విభాగంలో హరిణి, అక్షర, శ్రీగౌరి (కాకతీయ, నిజామాబాద్), రితిక (ఎంజేపీటీ, నిజామాబాద్), విశ్వజ (ఎంజేపీటీ, నిజామాబాద్) ఎంపికైనట్లు నిర్వాహకులు వెల్లడించారు. అండర్-14 బాలుర విభాగంలో నిల్సన్, రాథోడ్, సంజయ్, అంద్రి, అక్షిత్‌సాయి, పవన్, బాలికల విభాగంలో.. జాహ్నవి, రితిక, అశ్రిత, అఫియా, పాతిమా, మనుశ్రీలు తొలి 5 స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, స్వామిగౌడ్, సంతోష్, నాగరాజు, రఘురాం, రాజు, శ్రీధర్, అరుణ, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు

కామారెడ్డికి కేంద్ర ఔషధ గిడ్డంగి

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

కామారెడ్డి జిల్లాకు కేంద్ర ఔషధ గిడ్డంగి(సీడీఎస్) మంజూరైంది. జాతీయ వైద్య మిషన్ పథకంలో భాగంగా దీని ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కామారెడ్డి బోధనాసుపత్రిలో కేంద్రం ఏర్పాటుకు స్థలం అనువుగా లేకపోవడంతో వైద్యకళాశాలలో మూడు గదులను కేటాయించారు. అక్కడ గిడ్డంగిని ఏర్పాటుచేశారు. ఈ కేంద్రానికి పూర్తిస్థాయిలో ఔషధాలు అందుబాటులోకి వస్తే రోగుల వెతలు తీరనున్నాయి. కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చొరవతో కేంద్రం నెలకొల్పడానికి అడుగులు పడ్డాయి.

నివేదిక ఆధారంగా సరఫరా

జీజీహెచ్ ఆసుపత్రికి అనుబంధంగా ఏర్పాటుచేసే కేంద్ర ఔషధ గిడ్డంగికి అవసరమైన ఔషధాలు హైదరాబాద్ సీడీఎస్ నుంచి వస్తాయి. ఇక్కడికి చేరిన మందులను జిల్లాలోని వివిధ స్థాయి ఆసుపత్రులకు సరఫరా చేస్తారు. ఏ ఆసుపత్రులకు ఏయే మందులు అవసరం ఉన్నాయో కేంద్ర బాధ్యుడికి నివేదిక పంపుతారు. దాని ఆధారంగా సీడీఎస్ నుంచి నేరుగా ఆయా వైద్యాలయాలకు వెళతాయి. జిల్లాకేంద్రంలో కేంద్రం అందుబాటులో ఉండటంతో సేవలు మరింత సులభతరం కానున్నాయి.



నూతన కేంద్రంలో ఔషధాల నిల్వ

పక్కా భవనం ఏర్పాటు అవసరం

తాత్కాలికంగా వైద్యకళాశాలలో ఔషధ కేంద్రం ఏర్పాటుచేసినా భవిష్యత్తులో పక్కా భవనం ఏర్పాటు అవసరమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇచ్చిన మూడు భవనాలు సరిపోవు. గిడ్డంగి మాదిరిగా నిర్మాణాలు చేసి కేంద్రాన్ని విస్తరిస్తే వీలైనన్ని ఔషధాల సరఫరాకు ఆస్కారం ఉంది. కేంద్ర ఏర్పాటుతో నిజామాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ వెల్లడించారు. పీహెచ్‌సీలకు ఇక్కడి నుంచే నేరుగా మందులు సరఫరా అవుతాయన్నారు.

ఇదివరకు ఉమ్మడి జిల్లాకు ఒక్కటే..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కేంద్ర ఔషధ కేంద్రం 14 ఏళ్ల క్రితం మంజూరైంది. అక్కడి నుంచే ఉమ్మడి జిల్లాలోని వివిధ ఆరోగ్యకేంద్రాలకు ఔషధాలు సరఫరా చేస్తున్నారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో ఒకే కేంద్రం ఉండటంతో రోగులకు ఇబ్బందులు తలెత్తేవి. సరైన ఔషధాలు లేక రోగులు ప్రైవేటుగా మందులను కొనుగోలు చేశారు. అరకొర ఔషధాలతో ప్రభుత్వ వైద్యశాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

19న వాలీబాల్ పోటీలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఎస్ఏ మైదానంలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వాలీబాల్ పోటీలు ఉంటాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగాల్లో ఎంపిక లుంటాయని, ఆటగాళ్లు బోనాఫైడ్‌తో రావాలన్నారు. 2008 జనవరి 1, ఆ తర్వాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు.

ఉషూలోనూ..

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఎస్ఏ మైదానంలో ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉషూ క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగాల్లో పాల్గొనే క్రీడాకారులు బోనాఫైడ్ వెంట తెచ్చుకోవాలన్నారు. 2008 జనవరి 1, ఆ తర్వాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు.

వాన.. రైతుల్లో ఆందోళన



మాచారెడ్డి: కొత్తపల్లిలో నేలకొరిగిన వరి

జిల్లా అంతటా బుధవారం ఉదయం 8:30 గంటల ఉంచి గురువారం ఉదయం అదే సమయం వరకు వాయుగుండం ప్రభావంతో వర్షం కురిసింది. మాచారెడ్డి మండలం లచ్చాపేటలో అత్యధికంగా 56.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పల్వంచ మండలం ఎల్పుగొండలో 53.5, ఇసాయిపేటలో 49.5, దోమకొండలో 45 మి.మీల వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో ఇంతకంటే తక్కువగానే నమోదైంది. కోతకొచ్చిన వరి పొలాలు వర్షాలతో దెబ్బతినే అవకాశం ఉందని రైతులు కలవరపడుతున్నారు. కొన్నిచోట్ల ఆరబోసిన, కుప్పలు చేసిన ధాన్యం తడిసిపోయింది. మాచారెడ్డి, పల్వంచ మండలాల్లోని పలు గ్రామాల్లో వరి పొలాలు నేలకొరిగాయి.

- న్యూస్‌టుడే, కామారెడ్డి వ్యవసాయం, దోమకొండ, మాచారెడ్డి



దోమకొండలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈవో రాజు

కళల్లో రాణించాలి

కామారెడ్డి పట్టణం : విద్యార్థులు చదువుకోవడమే కాకుండా అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని డీఈవో రాజు అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో కళోత్సవ్ పోటీలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు కళలలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యాశాఖ వార్షిక సమన్వయ అధికారి వేణుశర్మ, సిబ్బంది శ్రవణ్‌కుమార్, విష్ణువర్ధన్, సంగీత, వసుధ, విజయశ్రీ, సుహాసిని, నర్సిరెడ్డి, రంగాచారి తదితరులున్నారు.

పదోన్నతులు కల్పించాలని నిరసన

భిక్కనూరు : అర్హత ఉన్నా తమకు పదోన్నతులు కల్పించకపోవడంపై తెవివి దక్షిణ ప్రాంగణం సహాయ ఆచార్యులు నిరసన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యానికి ఎండగడుతూ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి ప్రిన్సిపల్ కార్యాలయం ఎదురుగా నిరసన తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ డా.సుధాకర్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. టూటా ప్రధాన కార్యదర్శి డా.మోహన్‌బాబు మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం ద్వారా పదోన్నతులు కల్పించాల్సి ఉండగా అధికారుల పట్టించుకోవడం లేదని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.హరిత, డా.అంజయ్య, డా.నాగరాజు, డా.ప్రతిజ్ఞ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సహాయ ఆచార్యులు

బాధిత కుటుంబాలకు మేమున్నామని..

దుబ్బాక, న్యూస్‌టుడే: భిక్కనూరు మండలం కంచర్ల గ్రామానికి చెందిన కైరంకొండ లింగం దుబ్బాక 108 సర్వీస్‌లో వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో రెండు నెలల క్రితం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని 108, 102 ఉద్యోగ మిత్రులందరూ కలిసి తలా కొంత నగదు ఇవ్వడంతో రూ.2,09,535 పోగయ్యాయి. బాధిత కుటుంబానికి గురువారం దుబ్బాక వంద పడకల ఆసుపత్రిలో ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జనారన్, సిద్దిపేట జిల్లా ఎగ్జిక్యూటివ్ మేనేజర్ అఫ్రోజ్, రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాలాజీ నాయక్ చేతుల మీదుగా నగదును అందజేశారు.

భిక్కనూరు, న్యూస్‌టుడే: కామారెడ్డిలో ఆటో ఢీకొట్టిన ఘటనలో తెవివి దక్షిణ ప్రాంగణం హిస్టరీ విభాగానికి చెందిన విద్యార్థి ప్రీతమ్ ఆగస్టు 2న మృతి చెందాడు. విశ్వవిద్యాలయంలో విరాళాలు సేకరించి ప్రీతమ్ కుటుంబ సభ్యులకు రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి చేతుల మీదుగా రూ.1,13,300 ఆర్థిక సాయం గురువారం అందించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న 108 అధికారులు, సిబ్బంది



ప్రీతమ్ కుటుంబసభ్యులకు చెక్కు అందిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి

అవిశ్వాస తీర్మానం ఫలితం విడుదల చేయాలి

భిక్కనూరు, న్యూస్‌టుడే: గతంలో బస్వాపూర్ సింగిల్ విండో ఛైర్మన్ కిష్టాగౌడ్‌కు వ్యతిరేకంగా అప్పటి పాలకవర్గం సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఫలితాలను విడుదల చేయాలని విండో మాజీ వైస్‌ఛైర్మన్ మద్దిస్వామి, పాలకవర్గం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా సహకార అధికారికి మాజీ పాలకవర్గం సభ్యులు వినతిపత్రం ఇచ్చారు. సభ్యులు రాంరెడ్డి, నర్సింలు, సుధాకర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.



జిల్లా సహకార అధికారికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

కొనసాగుతున్న వైద్య విద్యార్థుల ప్రవేశాలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ సీట్లకు ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఇటీవల కౌన్సెలింగ్ పూర్తికావడంతో ఈ కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థులు వచ్చి రిపోర్ట్ చేస్తున్నారు. మొత్తం 100 సీట్లకు రాష్ట్రస్థాయి కోటాలో 85, జాతీయస్థాయిలో 15 సీట్లు ఉన్నాయి. రాష్ట్ర కోటా సీట్లన్నీ భర్తీ అయ్యాయి. జాతీయ కోటాలో 15 సీట్లకు ఐదుగురు కళాశాలను ఎంపిక చేసుకున్నారు. ఈ వారంలో పూర్తిస్థాయిలో ప్రవేశాలు పూర్తి కానున్నాయి. కళాశాలల మార్పునకు స్లైడింగ్‌కు అవకాశం ఉంది. వెబ్ ఆప్షన్లలో ఇతర కళాశాలను ఎంపిక చేసుకునే వీలు కల్పించారు. ఇక విద్యార్థులకు వసతిగృహాల ఎంపికకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే ప్రథమ సంవత్సర విద్యార్థులకు అశోక్‌నగర్‌లో ఆశ్రయం కల్పించారు.



ఏషియన్ ప్రియ సినీప్లెక్స్

వేట్టయాన్ ది హంటర్ 11.00 2.15 6.00 9.15
విశ్వం 11.00 2.00 6.00 9.00

వీ సినిమాస్

దేవర 5.50 9.15

ఏషియన్ దర్పన్

మార్టిన్ 6.00, 9.00

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



(ప్రశ్న): జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయ కాలనీలో కోతుల బెడద నెలకొంది. గతంలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. **- శ్రీకాంత్, రాజు, మురళి, ఉపాధ్యాయకాలనీ**

(జవాబు): కోతుల బెడద నియంత్రణకు చర్యలు చేపడతాం. వాటిని పట్టుకోవడానికి అటవీశాఖ సిబ్బందికి సూచిస్తాం. **- సుజాత, కమిషనర్**

(ప్రశ్న): దోమకొండ 9వ వార్డులో కందకంలో మురుగు పేరుకుపోయింది. దోమల ఇబ్బంది ఉంది. **- లక్ష్మణ్, దోమకొండ**

(జవాబు): పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- దయాకర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి, దోమకొండ**



(ప్రశ్న): బాన్సువాడ 19వ వార్డులో పలు చోట్ల మురుగు కాల్వలు చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. **- ప్రకాష్, బాన్సువాడ**

(జవాబు): ఈ విషయాన్ని పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత చెత్త నిల్వలు తొలగించి సమస్య పరిష్కరించారు.

(ప్రశ్న): పిట్లం మండల కేంద్రంలోని విద్యుత్తు కార్యాలయం ఎదుట కల్వర్టు ప్రమాదకరంగా మారింది. **ఓంకార్, స్థానికుడు**

(జవాబు): సంబంధితశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతాం,
యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం.

-న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం,పిట్లం, కామారెడ్డి పట్టణం, దోమకొండ, రామారెడ్డి,



(ప్రశ్న): జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురలో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. **- అక్బర్, ఇస్లాం**

(జవాబు): సిబ్బందికి చెప్పి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



(ప్రశ్న): కామారెడ్డిలో గొల్లవాడలో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. **- రాము, గొల్లవాడ**

(జవాబు): చెత్త సేకరణ చేపట్టాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



(ప్రశ్న): జిల్లాకేంద్రంలోని భవానీరోడ్డులో మురుగు కాల్వ పూడిక పేరుకుపోయింది. **- నారాయణ, భవానీరోడ్డు**

(జవాబు): కాల్వ పూడిక తీయించాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



(ప్రశ్న): రంగంపేట్ గ్రామ శివారులో ఆర్‌అండ్‌బీ రోడుకు ఇరువైపులా వర్షాలకు మట్టి కోతకు గురి కావడంతో చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మేమున్నాం మీకు తోడుగాలో సమస్య ప్రచురితమవడంతో ఏఈ రవితేజ స్పందించి గుత్తేదారుడితో మొరం పోయించారు.

అసంపూర్తి పనులు.. రాకపోకలకు అగచాట్లు

న్యూస్‌టుడే,పిట్లం

రహదారులతో పాటు వారధుల నిర్మాణం ప్రజా రవాణాకు ఎంతో కీలకం. వంతెనలు లేకపోతే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. వర్షాకాలం, అత్యవసర సమయాల్లో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ప్రగతి పనులకు సర్కారు నిధులు మంజూరు చేస్తున్నా గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యం వల్ల కొన్ని నెలలుగా పనుల్లో పురోగతి లేకుండా పోతోంది. అంతర జిల్లాలను అనుసంధానం చేసే కామారెడ్డి జిల్లా పిట్లం మండలం తిమ్మానగర్, సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం ఫత్తేపూర్ మధ్య నల్లవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు పూర్తికాకపోవడంతో పిట్లం, కల్హేర్, సిర్గాపూర్, నారాయణఖేడ్ ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నల్లవాగుపై ఐదు దశాబ్దాల కిందట వంతెన నిర్మాణం చేపట్టారు. నాలుగేళ్ల కిందట వాగు పొంగి పొర్లడంతో వరద తీవ్రతకు వంతెన సమీపంలో ముళ్ల పొదలు, చెట్ల దుంగలు కొట్టుకువచ్చి నిలవడంతో రోడ్డు, వంతెన కోతకు గురైంది. రాకపోకల నిమిత్తం తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అది కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి.



తిమ్మానగర్ వైపు కంకరతో అధ్వానంగా

కంకర పరిచి వదిలేసి...

ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు 2022లో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.86 కోట్లు మంజూరు చేసింది. ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనులను గుత్తేదారులు నిబంధనల ప్రకారం పూర్తి చేయాల్సి ఉంది. వారధి పనులు చివరి దశకు వచ్చాయి. రహదారి పనుల్లో భాగంగా వంతెనకు ఇరువైపులా కంకర పరిచి అసంపూర్తిగా వదిలేశారు. కొన్ని నెలలుగా నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు.



తుది దశలో వంతెన పనులు

బిల్లులు రాక నిలిచిపోయాయి

వినోద్‌కుమార్, ఆర్ అండ్ బీ ఏఈ, పిట్లం

తిమ్మానగర్ వద్ద చేపడుతున్న వంతెన పనులు చివరిదశలో ఉన్నాయి. ఇరులైపులా రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నిధులు లేక చేసిన పనులకు బిల్లులు రాక పనులు నిలిచిపోయాయి. త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం.

వానల భయం.. తక్కువ ధరకు విక్రయం





తేమశాతం తగ్గించడానికి కోసిన ధాన్యాన్ని అన్నదాతలు రోడ్లపై ఆరబెడుతున్నారు. రోజంతా ఆ పనిలో ఉండగా.. ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు వచ్చి వర్షాలు కురిసి తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీర్కూర్ మండలంలో ఏ రోడ్డుపై చూసినా ఆరబెట్టిన ధాన్యమే కనిపిస్తోంది. వర్షాల భయానికి రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా ప్రైవేట్ వ్యాపారులు లారీలను పొలాల వద్దకే తీసుకొచ్చి అక్కడే తూకం వేసి బస్తాలను తరలిస్తున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.

ఈనాడు - నిజామాబాద్

మాదిగలను మోసం చేస్తే మూల్యం తప్పదు

కామారెడ్డి అర్బన్ మాదిగలను మోసం చేస్తే భారీ మూల్యం తప్పదని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకట్రాములు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ర.భ. శాఖ అతిథిగృహంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ అంశాన్ని పక్కనపెట్టి డీఎస్సీ ఫలితాలను విడుదల చేయడాన్ని వారు ఆక్షేపించారు. వర్గీకరణను అమలు చేసిన తర్వాతే నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు పురుషోత్తం తదితరులున్నారు

ప్రైవేటు కళాశాలల ప్రతినిధుల నిరసన

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే : ఉపకార వేతనాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు గురువారం అంబేడ్కర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల నిర్వహణ భారంగా మారిందని చెప్పారు. కార్యక్రమంలో బాన్సువాడలోని ఎస్ఎస్ఎల్, శశాంక్, పిట్లం ఎస్వి, జుక్కల్ రెయిన్‌బో, మద్నూర్ రత్న కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కళాశాలల ప్రతినిధులు

ఆకస్మిక తనిఖీలు.. సూచనలు

మాచారెడ్డి, బీబీపేట, కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి వివిధ మండలాల్లోని పాఠశాలలు, ఆసుపత్రులను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. మాచారెడ్డిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. రోగులకు అందుబాటులో ఉండాలని వైద్యులకు సూచించారు. బీబీపేట టీఎస్ఎన్ఆర్ పాఠశాలను, ఉగ్రవాయి ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



మాచారెడ్డి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కలెక్టరేట్‌లో ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉద్యోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్యశిబిరాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. టీజీవోలు, టీఎన్‌జీవోలు సంయుక్తంగా ఉద్యోగుల కోసం ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. 370 మంది ఉద్యోగులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, సీపీవో రాజారాం, టీజీవో అధ్యక్షులు దేవేందర్, టీఎన్జీవోస్ అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, టీజీవో కార్యదర్శి సాయిరెడ్డి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను గురువారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ రాగూరు, కిష్టయ్య ఉన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో..



బిచ్కుందలో..



పెద్దకొడప్‌గల్‌లో...



వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

మహర్షి వాల్మీకి జయంతి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి జయంతిని కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి కవిగా, తత్వవేత్తగా పేరుగడించారని కొనియాడారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి చందర్, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, టీఎన్జీవోస్ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి నేరవిభాగం: జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో పరిపాలనాధికారి, సూపరింటెండెంట్‌లు, ఎస్బీ సీఐ జార్జ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నవీన్‌కుమార్, సంతోష్‌కుమార్, కృష్ణ, ఆర్ఎస్సైలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాకవి

జుక్కల్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్ : నియోజకవర్గ వ్యాప్తంగా ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూజలు చేసి, భక్తిని చాటుకొన్నారు.



బస్వాపూర్‌లో వాల్మీకి చిత్ర పటానికి హారతి పడుతున్న భక్తులు, భజన చేస్తున్న వార్‌కారీలు

పట్టణ కమిటీ ఎన్నిక

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అంబేడ్కర్ యువజన సంఘం పట్టణ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రోల బాబు, ఉపాధ్యక్షులుగా నపారి కృష్ణ, గుస్కొ అంజయ్య, సాయిబాబా, సిద్దు, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రాజు, సంయుక్త కార్యదర్శిగా దేవకుమార్, గంగారాం, ప్రశాంత్, ముఖ్య సలహాదారుడిగా సుదర్శన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు సురేందర్, ఎల్లారెడ్డి డివిజన్ కమిటీ అధ్యక్షుడు సాయిబాబా, పద్మారావు, సాయిలు, మొగులయ్య, బుజ్జి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం తనిఖీ

నాగిరెడ్డిపేట, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సీ వసతి గృహాన్ని గురువారం సంక్షేమాధికారి వెంకటేశ్ తనిఖీ చేశారు. పండగ అనంతరం విద్యార్థులు వసతి గృహానికి రాగా సిబ్బంది లేకపోవడంతో పై అధికారులకు సమాచారం ఇచ్చారు. దానిలో భాగంగా తనిఖీకి వచ్చినట్లు చెప్పారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాత

వసతుల కల్పనకు ప్రాధాన్యం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో వివిధ వార్డుల్లో ప్రజలకు కనీస అవసరాలను తీర్చేందుకు అన్ని రకాల చర్యలు చేపడతామని పురపాలక ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. గురువారం కామారెడ్డి పరిధిలోని 2వ వార్డు రామేశ్వర్‌పల్లిలో రెండు పడకగదుల గృహ సముదాయం వద్ద లబ్ధిదారులతో మాట్లాడారు. స్థానిక సమస్యలపై ఛైర్‌పర్సన్ కమిషనర్ సుజాత దృష్టికి తెచ్చారు. పారిశుద్ధ్య సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 18వ వార్డు భవానీనగర్‌లో సమస్యలపై వారు పరిశీలించారు. ఇంకుడుగుంతల మరమ్మతులు చేపట్టారు. నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, పంపరి శ్రీనివాస్, రామ్మోహన్, అఫీజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బల్దియా అభివృద్ధికి కృషి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్నట్లు బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్ పేర్కొన్నారు. పట్టణంలోని కార్యాలయంలో గురువారం సాధారణ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బల్దియా పరిధిలోని 19 వార్డుల్లో మిగిలిన పనులకు రూ.3.10కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 8 అంశాలపై చర్చించినట్లు చెప్పారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ షేక్ జుబేర్, కమిషనర్ శ్రీహరి రాజు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఛైర్మన్ జంగం గంగాధర్

సకాలంలో తూకం వేయాలి

గాంధారి, న్యూస్‌టుడే: రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో ధాన్యం తూకం వేయాలని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేసి సీతాయిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి సొసైటీ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం ముదెల్లిలోని అంగన్వాడీ కేంద్రంతో పాటు ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించి పలు దస్త్రాలు, రికార్డులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడారు. ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, డీఎం(సీఎస్) రాజేందర్, డీసీఎస్ఓ నరసింహారావు, డీటీ రవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కుప్పను పరిశీలిస్తున్న అధికారులు

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి..!

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: రామారెడ్డి మండలానికి చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. ప్రసవ సమయంలో శస్త్రచికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించడంతో.. ఆమెను ఆసుపత్రి వైద్యులు కుట్లు వేయకుండానే మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఆమె పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారడంతో అక్కడి ఆసుపత్రి వైద్యులు హైదరాబాద్‌కు తరలించాలని అన్నారు. దీంతో మేడ్చల్ ప్రాంతానికి చేరుకునేలోపే గురువారం తెల్లవారుజామున సదరు గర్భిణి చనిపోయింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు తొలుత శస్త్రచికిత్స చేసిన ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుల వద్ద గొడవకు దిగారు.

ఉపాధ్యాయుల నిరసన

బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బోర్లం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో టీచర్లకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని గురువారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సంఘం నాయకులు అయ్యాల సంతోష్ , ఉపాధ్యాయులు సాయిరాం, గోపి, చైతన్య, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటిశుద్ధి యంత్రం వితరణ

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: స్థానిక పీహెచ్‌సీకి గురువారం ఒక ప్రైవేటు సంస్థ వారు నీటి శుద్ధియంత్రాన్ని వితరణ చేశారు. వైద్యుడు సృజన్ కుమార్ దాతల సేవలను కొనియాడారు.

క్షేత్ర స్థాయి పర్యటన

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: నాగిరెడ్డిపేట మండలానికి చెందిన తాండూరు గ్రామ రైతులు క్షేత్రపర్యటనలో భాగంగా జహీరాబాద్‌లోని చెరకు పంటను పరిశీలించారు. గాయత్రీ చక్కెర పరిశ్రమ జీఎం రామారావు మాట్లాడుతూ.. ఒక రైతు 25 నుంచి 30 ఎకరాల్లో చెరకు పంటను సాగు చేస్తున్నారని, ఆయన అనుభవాలు, సాగు విధానాలు రైతులకు వివరించినట్లు చెప్పారు. సిబ్బంది మహేశ్, శ్రీనివాస్, రైతులు నాగేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి, దుర్గయ్య పాల్గొన్నారు.



చెరుకు పంటను పరిశీలిస్తున్న తాండూరు గ్రామ రైతులు

వాహనం ఢీకొని హమాలీ మృతి



రాములు

బీర్కూర్, న్యూస్‌టుడే : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో అతను మృతిచెందిన ఘటన బీర్కూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. బీర్కూర్ వాసి రాములు (52) హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. బుధవారం రాత్రి ధాన్యం బస్తాలు లారీల్లో నింపేందుకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయటకెళ్లారు. బాన్సువాడ ప్రధాన రహదారి వైపు నడుచుకుంటూ వెళ్తున్న రాములును గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో అతని రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తనకు ప్రమాదం జరిగిందని, త్వరగా రావాలని రాములు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారు. కుటుంబ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని 108 వాహనంలో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. పరిస్థితి విషమించిందని, హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో తరలించే సమయంలోనే రాములు మృతిచెందారు. గురువారం బాన్సువాడ ప్రాంతీయ దవాఖానాలో రాములు మృతదేహానికి శవపరీక్ష చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాములును ధాన్యం బస్తాల లారీ ఢీకొని ఉండొచ్చని కుటుంబీకులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్సై చెప్పారు.

ట్రాక్టర్ ఢీకొని ...

పిట్లం, న్యూస్‌టుడే: ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రాంపూర్‌కలాన్‌లో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్‌కలాన్‌కు చెందిన శంకర్(38) వ్యవసాయ పొలం నుంచి నూర్పిడి చేసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తీసుకొస్తుండగా అది కూరుకుపోయింది. వేరొక ట్రాక్టర్ సహాయంతో బయటకు తీసే క్రమంలో వాహనం ఢీకొని ఘటనా స్థలంలో దుర్మరణం చెందాడు. శంకర్ భారాస గ్రామ అధ్యక్షుడిగా పనిచేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అందరితో కలివిడిగా ఉండే శంకర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



శంకర్

జాతీయ రహదారిపై

బిచ్కుంద: కందర్‌పల్లి జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. జుక్కల్ మండలం హంగర్గ గ్రామానికి చెందిన ధూస్లె లక్ష్మణ్ (40) బిచ్కుందలో కూలి పని కోసం వచ్చి ఇంటికి తిరిగి వెళ్లడానికి కందర్‌పల్లి గ్రామంలో జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ..

గాంధారి, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన నేరల్ గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వడ్డె శ్రీను(70) గాంధారికి చెందిన కాటిపాకల లక్ష్మణ్‌తో కలిసి నేరల్ గ్రామ శివారులోని చెరువు(కుంట)లో చేపలు, ఎండ్రికాయలు పట్టడానికి వెళ్లారు. శ్రీను వల తీసుకొని చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు వల చుట్టుకొని నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. మృతుని భార్య సాయవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు.

ఒకరికి గాయాలు

గాంధారి, న్యూస్‌టుడే: పొతంగల్ కలాన్‌కు చెందిన కొందరు భక్తులు తీర్థయాత్రకు వెళ్తున్న క్రమంలో బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి.

చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి మండలం క్యాసంపల్లిలో గురువారం ఉదయం నుంచి వృద్ధురాలు కుమ్మరి బాల్‌రాజవ్వ (95) ఇంట్లో కనిపించలేదు. ఆమె కోసం కుటుంబీకులు వెతకగా నాగం కుంట చెరువులో మధ్యాహ్నం 12 గంటలకు మృతదేహం కనిపించింది. మృతురాలి కొడుకు సిద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

మాజీ సర్పంచి బెదిరింపులపై ఫిర్యాదు

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు మాజీ సర్పంచి తునికి వేణుతో తనకు, తన కుటుంబానికి ప్రాణ భయం ఉందని స్థానిక యువకుడు రాజు సీఐ సంపత్‌కు గురువారం ఫిర్యాదు చేశాడు. ఇటీవల భిక్కనూరు చౌరస్తాలో ఫ్లెక్సీ చింపేసిన ఘటనలో కొందరు యువకులతో పాటు తాను నిరసన వ్యక్తం చేశానని, ఇది మనసులో పెట్టుకుని మాజీ సర్పంచి వేణు ఇంటికి పిలిపించుకుని తనను, అమ్మను బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. గురువారం మరోసారి తన ఇంటికి వచ్చిన మాజీ సర్పంచి గొడవకు దిగాడని వాపోయాడు.

ట్రస్ట్ పేరిట రిజిస్ట్రేషన్‌పై వాగ్వాదం

కామారెడ్డి పట్టణం,: జిల్లాకేంద్రంలోని వివేకానందకాలనీలో సీతారామాంజనేయ ఆలయ ట్రస్ట్ పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేయడంపై కౌన్సిలర్ మోటూరి శ్రీకాంత్ సబ్ రిజిస్ట్రార్‌తో గురువారం వాగ్వాదానికి దిగారు. ఇటీవల ఎన్నికైన కమిటీ ఆలయానికి సంబంధించి 2600 గజాల స్థలాన్ని ఏ ప్రాతిపాదికన పత్రాల్లో చూపుతారని ప్రశ్నించారు.

బీర్కూర్‌లో బంద్ ప్రశాంతం

బీర్కూర్, న్యూస్‌టుడే: దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ సంఘాల నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు బీర్కూర్‌లో గురువారం బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌కు సహకరించారు. దేవాలయాలపై దాడులకు పాల్పడుతున్నా నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ హిందూ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా నస్రుల్లాబాద్ హైవే పెట్రోలింగ్ ఎస్సై మన్సూర్‌ఖాన్, బీర్కూర్, నస్రుల్లాబాద్ ఏఎస్సైలు సీతారామమ్మ, వెంకట్‌రావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. హిందూ సంఘాల నాయకులు బీరుగొండ, బస్వరాజ్, సాయిబాబా, లింగం, గాలయ్య, శంకర్ ఉన్నారు.



మూసివేసిన దుకాణాలు

గ్రామదేవతల విగ్రహాల ధ్వంసంపై ఫిర్యాదు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డు-లలితానగర్ కాలనీలోని గ్రామ దేవతల విగ్రహాలను ధ్వంసం చేసిన విషయమై పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డికి కామారెడ్డి హౌసింగ్‌బోర్డు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఫిర్యాదు చేశారు. స్థానికంగా గతంలో ఏర్పాటు చేసిన పోచమ్మ, ముత్యాలమ్మ, లక్ష్మమ్మ ఆలయాల్లో విగ్రహాలను ఈ నెల 16న అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడమే కాకుండా వస్తువులను ఎత్తుకెళ్లారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు